సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



శిశువు మృతి

జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన మగ శిశువు మృతి చెందడంపై బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. 8లో ▸



లాభాల జాజికాయ

జాజికాయ, జాపత్రి సాగుకు ఉమ్మడి పశ్చిమలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట విస్తరణకు ఉద్యాన వర్సిటీ ప్రయత్నాలు చేస్తోంది. 8లో ▸



ఎస్‌జీఎఫ్ పోటీలు

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లాస్థాయి పోటీలు పెదవేగిలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ న్యాయ విభాగంలో నియామకాలు



సాధిక్ హుస్సేన్
జోనల్ ఇన్‌చార్జి



బడుగు అశోక్‌బాబు
జిల్లా అధ్యక్షుడు

సాక్షి, భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా సాధిక్ హుస్సేన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా బడుగు అశోక్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

23 నుంచి మద్దిలో పవిత్రోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న ఈఓ కొండలరావు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. గురువారం క్షేత్రంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 26 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామన్నారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణ, అంకురార్పణ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, కుంభ పూజ, శాంతి హోమాలు, చతుర్వేదధ్యయనం, పవిత్ర ఆరోపణ, మహా పూర్ణాహుతి, దీక్ష విసర్జన వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పవిత్రోత్సవాలు పూర్తయ్యే వరకు గర్భాలయ దర్శనం నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. మరలా ఈనెల 26న మధ్యాహ్నం 3 గంటల నుంచి గర్భాలయ పునఃదర్శనం ప్రారంభిస్తామన్నారు. అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ కోర్సులకు స్కిల్ హబ్ శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా వట్లూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ (ఏడీడీ) ఆపరేటర్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.రజిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల యాజమాన్యాలతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్న యువతను గుర్తించి వారికి హబ్‌లలో శిక్షణకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఎంఎస్ ఆఫీస్, టైపింగ్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 15 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులకు, కోర్సు కాలవ్యవధి మూడు నెలలు అని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ కె.శ్యాంభూషణ్‌కుమార్‌ను సెల్ 8978524022లో సంప్రదించాలని కోరారు.

52 జాబ్‌మేళాలు.. 2,196 మందికి ఉపాధి

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా ఈ ఏడాది ఆగస్టు వరకు 52 జాబ్ మేళాలు నిర్వహించి 2,196 మందికి ఉపాధి కల్పించామని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కార్యాలయం ద్వారా రోజూ రిజిస్ట్రేషన్స్, రెన్యూవల్స్ జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఏడాదికి 3 వేల మంది కొత్తగా నమోదు చేసుకుంటుండగా మరో 1,200 మంది రెన్యూవల్స్ చేసుకుంటున్నారని తెలిపారు. మొత్తంగా ఎన్‌సీఎస్ పోర్టల్ నందు ఈ ఏడాదిలో ఆగస్టు వరకు 11,906 మంది వివరాలు నమోదు చేశామని పేర్కొన్నారు. ప్రతినెలా తమ కార్యాలయంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, అలాగే ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ ద్వారా ఆయా నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలు నిర్వహించి పెద్ద ఎత్తున ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2021లో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు మోడల్ కెరీర్ సెంటర్‌ను మంజూరు చేసిందని, డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్‌ను నియమించారని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి ఈ కెరియర్ సెంటర్ నిరుద్యోగ యువతకు సేవలందిస్తుందన్నారు. అలాగే తమ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో కొత్త హాల్‌ను అన్ని సౌకర్యాలతో నిర్మించారని పేర్కొన్నారు. జాబ్‌మేళాల నిర్వహణకు అన్ని సౌకర్యాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కౌలుకు భరోసా

'కౌలు'కునేలా సాయం

- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు
- విరివిగా పంట రుణాలు
- కార్డుల ద్వారా పెట్టుబడి సాయం అందజేత
- 2023–24లో లక్ష్యానికి మించి పంపిణీ

కౌలు గుర్తింపు కార్డుల లక్ష్యం 56,433	కౌలు గుర్తింపు కార్డుల అందజేత 58,456
పెట్టుబడి సాయం 11,676 మందికి రూ. 8.75 కోట్లు	పంట రుణాల మంజూరు 12,844 మందికి రూ. 51.33 కోట్లు

ఏలూరు (మెట్రో): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా.. వ్యవసాయాన్ని పండుగ చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తోంది. రైతులతో పాటు కౌలు రైతులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా పంట సాగుదారు హక్కు చట్టం –2019 ద్వారా రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తోంది. కౌలు రైతులకు అందించే పంట సాగుదారు హక్కు పత్రాలను లక్ష్యానికి మించి పంపిణీ చేస్తూ వారి సంక్షేమానికి కూడా పాటుపడుతోంది.

ఎన్నడూ లేనివిధంగా..

గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గ్రామాల్లోనే రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సకల సౌకర్యాలు కల్పిస్తోంది. అలాగే కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా భూయాజమాన్య హక్కులకు భంగం కలగకుండా కౌలుదారులకు నిర్ణీత కాల వ్యవధిలో పండిన పంటలపై మాత్రమే హక్కు కల్పిస్తూ పంట సాగుదారు హక్కు చట్టం ద్వారా రాయితీలు అందిస్తోంది. కౌలు రైతుల పాలిట వరంగా మారిన ఈ విధానాన్ని గతంలో ఏ ప్రభుత్వమూ పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా అమలు చేయలేదు. గత ప్రభుత్వాలు కౌలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి.



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న అధికారులు (ఫైల్)

పాలకులకు అనుకూలంగా వ్యవహరించే వారికి మాత్రమే కౌలు కార్డులు మంజూరు చేశాయి. దీంతో అసలైన కౌలు రైతులకు తీవ్ర నష్టం జరిగేది. అయితే దీనికి భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూమి లేని సన్న, చిన్నకారు, నిరుపేద కౌలు రైతులకు, దేవదాయ భూములు సాగు చేసుకునే రైతులకు సైతం పంట సాగుదారు హక్కుపత్రాలు జారీ చేస్తూ అన్నింటా అండగా నిలుస్తోంది.

103.58 శాతంతో.. ఏలూరు జిల్లాలో 2023–24లో లక్ష్యానికి మించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 56,433 మంది కౌలు రైతులకు పత్రాలు పంపిణీ లక్ష్యంగా నిర్ధయించగా 58,456 మందికి అందజేసి 103.58 శాతాన్ని నమోదు చేసుకుంది. వీరిలో అర్హులైన 11,676 మంది కౌలు రైతులకు రూ.8.75 కోట్ల పెట్టుబడి సాయంగా వారి ఖాతాల్లో జమ చేశారు. అలాగే 12,844 మంది కౌలు రైతులకు రూ.51.33 కోట్లు పంట రుణాలను బ్యాంకుల ద్వారా జిల్లా అధికారులు ఇప్పించారు. అర్హుల జాబితాలను సైతం ఆయా సర్వీసు ఏరియా బ్యాంకులకు జిల్లా వ్యవసాయశాఖఅధికారులు పంపించారు. గుర్తింపు కార్డులు పొందిన ప్రతి ఒక్క కౌలు రైతుకు రైతులతో సమానంగా సహాయం అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అర్హులందరికీ కార్డులు



జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికీ కౌలు గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నాం. కౌలు రైతులు ఏ ఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులతో సమానంగా వారికీ సంక్షేమ పథకాలు అందించేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు.

– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు

వేగంగా రీసర్వే

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో రీసర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం, రీ సర్వే తదితర అంశాలపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో రీ సర్వేలో భాగంగా మొదటి విడతలో స్టోన్ ప్లాంటేషన్ పూర్తికాగా, రెండో విడతలో గ్రౌండ్ ట్రూతింగ్, ఇతర ప్రక్రియలు పూర్తి చేశామన్నారు. ఇప్పటికే మూడో విడతలో రీసర్వే ప్రక్రియ మొదలుకాగా, జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో వేగంగా రీ సర్వే పనులను చేపట్టి సకాలంలో లక్ష్యాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

● 'ధన'పతి



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెంలోని గొల్లగూడెం సెంటర్‌లోని రామ్స్ యూత్ ఏర్పాటుచేసిన పందిరిలో లక్ష్మీగణపతి స్వామిని రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

– తాడేపల్లిగూడెం (టీఓసీ)

ఎన్నికల పనులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనులపై దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా పోలింగ్ స్టేషన్‌ల స్థితిగతులపై తక్షణం నివేదికలు అందజేయాలన్నారు. గురువారం ఆమె పట్టణంలోని 7వ వార్డు, నరసాపురం మండలం పసలదీవి, మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఇప్పటి నుంచే ప్రాథమికంగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రతి రెండు కిలోమీటర్ల పరిధిలోపు ఒక పోలింగ్ స్టేషన్ ఉండేలా చూడాలని ఆదేశాలు ఉన్నాయని, ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల విషయంలో మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే నివేదికలు అందజేయాలని సూచించారు.

1,500 ఓటర్లు దాటితే అదనపు కేంద్రం



నరసాపురంలోని 7వ వార్డులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

1,500 మంది ఓటర్లు దాటి ఉన్న ప్రాంతాల్లో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, అలాంటి ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు ఉండాలని, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను, ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ కె.కృష్ణవేణి, తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, జి.అనితాకుమారి, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు. అలాగే కలెక్టర్ ప్రశాంతి పాలకొల్లు మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలోని పెంకుళ్లపాడు, పాలకొల్లు 20వ వార్డు ఎస్సీ కాలనీలో మార్పు చేసిన పలు పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు

జేసీ రామసుందర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: పోలింగ్ కేంద్రాలను అన్ని మౌలిక సదుపాయాలతో పకడ్బందీగా తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఎల్.అగ్రహారం, సుబ్బారావుపేట, కుంచనపల్లి, పెంటపాడు మండలంలోని రావిపాడు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు సులువుగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



తాడేపల్లిగూడెంలో సూచనలిస్తున్న జేసీ

పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం సుబ్బారావుపేట ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.దుర్గేష్, తహసీల్దార్ దుర్గాకిషోర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామ సచివాలయాన్ని, తణుకు మండలం మండపాక గ్రామ శివారు ఎర్రనీలిగుంట, ఇరగవరం మండలం రేలంగి శివారు గమళ్లపాలెం గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, పలు పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు.

పోటీతత్వంతో పనిచేయాలి

కలెక్టర్లకు సీఎస్ దిశానిర్దేశం

భీమవరం (ప్రకాశంచౌక్): లక్ష్యసాధనలో పోటీతత్వంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సూచించారు. గురువారం విజయవాడ సచివాలయం నుంచి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి హాజరయ్యారు. విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమంలో సాధించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, విద్యాశాఖలో ప్రగతి, వ్యవసాయ శాఖలో ఈకేవైసీ నమోదు, జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, స్పందన ఫిర్యాదులు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. రాష్ట్రంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో 7,535 సచివాలయాలు వంద శాతం సాధించాయని, మిగిలిన సచివాలయాల్లో కూడా ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మనబడి నాడు–నేడు పనులకు నిధుల కొరత లేదని, అదనపు తరగతి గదుల నిర్మాణం వెంటనే పూర్తిచేయాలన్నారు. జగనన్న గోరుముద్ద కింద పాఠశాలలకు కొత్తగా వంట పాత్రలు సరఫరా చేస్తున్నామన్నారు. నెలాఖరులోపు పీఎం కిసాన్ రైతుల ఈకేవైసీ పూర్తిచేయాలన్నారు. వచ్చేనెలలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించే అవకాశం ఉన్నందున పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను పూర్తి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష అమలుపై ప్రజలకు మెరుగైన అవగాహన కల్పించేలా వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాల వారీగా బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీఎల్‌డీఓ అప్పారావు, డీఈఓ ఆర్.వెంకటరమణ, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, హౌసింగ్ పీడీ ఆర్‌సీ ఆనందకుమార్ పాల్గొన్నారు.

యువత.. ఉత్సాహ భరిత

ఆకట్టుకున్న జిల్లాస్థాయి యువజనోత్సవాలు



సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో జానపద నృత్యాలు ఫోక్ డ్యాన్స్ వంటి విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు, ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతను చైతన్యం చేసేందుకు ఏర్పాటుచేసిన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు పలు విభాగాల్లో సత్తాచాటి బహుమతులు గెలుచుకున్నారు. డిస్ట్రిక్ట్ యూత్ కో–ఆర్డినేటర్ ప్రవీణ్ కిషోర్, సెట్‌వెల్ సూపరింటెండెంట్ కేజీ కెనడి, పి.ప్రసాద్, డాన్స్ మాస్టర్ జి.రాజేష్ పాల్గొన్నారు.



భీమవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, నిర్వాహకులు

విజేతలు వీరే..

- ఫోక్‌డాన్స్ సోలో.. కె.ఖ్యాతి (ఎస్‌కేఎస్‌డీ తణుకు), లక్ష్మీ ప్రసన్న (ఎస్ఆర్‌కేఆర్), జీవై లక్ష్మి (ఎస్‌కేఎస్‌డీ తణుకు) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- స్టోరీ రైటింగ్.. ఐ.వెన్నల గ్రేస్ (ఎస్‌కేఎస్‌డీ తణుకు), వి.సత్య వరలక్ష్మి (ఎస్‌కేఎస్‌డీ తణుకు), వి.సాహితి స్ఫూర్తి (ఎస్‌కేఎస్‌డీ తణుకు) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- ఫోక్ డ్యాన్స్ గ్రూప్.. ఖ్యాతి గ్రూప్ (ఎస్‌కేఎస్‌డీ తణుకు) విజేతగా నిలిచింది.
- ఫోక్ సాంగ్ సోలో.. కె.చిన్ని బాబు (ఎస్‌కేఎస్‌డీ తణుకు), కె.సుస్మిత (ఎస్ఆర్‌కేఆర్ భీమవరం), సీహెచ్ సాయిరాం (ఎస్ఆర్‌కేఆర్,భీమవరం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

మొక్కుబడిగా ముగించి..

జిల్లాలోని 20 మండలాలు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు పట్టణాల్లో ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయినా యువజనోత్సవాల్లో కేవలం తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మాత్రమే పాల్గొన్నారు. దీంతో యువజనోత్సవాలు మొక్కుబడిగా సాగాయి.

నేడు కాళ్లలో 'జగనన్నకు చెబుదాం'

కాళ్ల: కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కాళ్ల మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని కోరారు.

'ఉద్యాన' ప్రవేశాలకు కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 11 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండేళ్ల డిప్లమో కోర్సు ప్రవేశానికి గురువారం వర్సిటీలో కౌన్సెలింగ్ జరిగింది. 528 సీట్లకు ఆఫ్‌లైన్ పద్ధతిలో సీట్ల కేటాయింపు జరగ్గా.. దరఖాస్తు చేసుకోలేకపోయిన అభ్యర్థుల కోసం చివరి కౌన్సెలింగ్ నిర్వహించారు. పలు జిల్లాలకు చెందిన 18 మంది ప్రవేశాలు పొందారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ జానకీరామ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో హార్టికల్చర్ ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. పలు అవకాశాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. జాతీయ స్థాయిలో ఏ గ్రేడ్ గుర్తింపు పొందిన వర్సిటీలో చదువుకునే అవకాశం రావడంతో భవిష్యత్‌కు మంచి పునాది పడుతుందన్నారు. ఇంటర్‌కు సమానమైన డిప్లమో కోర్సు చేసిన వారు నేరుగా జనరల్ డిగ్రీ కళాశాలల్లో బీఎస్సీ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చన్నారు. వర్సిటీ పరిధిలోని బీఎస్సీ హార్టీకల్చర్ డిగ్రీ కోర్సులో చేరడానికి హార్టిసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం పొందవచ్చన్నారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పరిశోధనా సంచాలకులు ఎల్.నారం నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ స్వామి పాల్గొన్నారు.



ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పత్రాలు అందిస్తున్న వీసీ జానకీరామ్

క్లుప్తంగా

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు



జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొన్న యువత

పెదవేగి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 14, 17 సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు పెదవేగి డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రారంభించారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే.జయరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 300 మంది ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు.

క్రమం తప్పని వ్యాయామంతో మతిమరుపునకు చెక్

తణుకు టౌన్: క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం ద్వారా మతిమరుపు (అల్జీమర్స్) నుంచి బయటపడవచ్చని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కె.ఆనంద్ చెప్పారు. గురువారం సాయంత్రం ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జ్ఞాకపశక్తిని పెంచే ఆటలను వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమానికి అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఆర్‌జీ భాస్కరరావు, అక్కిన బాపినీడు, ఏ సుబ్రహ్మణ్యం, వెంకటరెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల జీతాల చెల్లింపునకు ఆదేశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సమగ్రశిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న సుమారు 25 వేల మంది ఉద్యోగులకు గత రెండు నెలలుగా జీతాలు అందడంలేదని.. వెంటనే జీతాలు విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వర రావు, షేక్ సాబ్జీ గురువారం వినతిపత్రం సమర్పించారు. వివరాలను ఎస్ఎస్ఏ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు పత్రికలకు విడుదల

లాభాల జాజికాయ

- ఉమ్మడి పశ్చిమలో విస్తరణకు యాక్షన్ ప్లాన్
- ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో మార్గదర్శనం



జాజికాయ



జాపత్రి

తాడేపల్లిగూడెం: సుగంధ ద్రవ్యాల్లో జాజికాయ, జాపత్రిల ప్రత్యేకత వేరు. వంటకాలకు ప్రత్యేక రుచిని అందించే ఈ సుగంధ ద్రవ్యాల్ని ఇప్పుడు ఉమ్మడి పశ్చిమలో పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట రాబోయే రోజుల్లో జిల్లాలో విస్తరించడానికి ఉద్యానవర్సిటీ ప్రయత్నాలు చేస్తోంది.

జాజికాయ, జాపత్రి ఒకే చెట్టు నుంచి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వంలో పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతరపంటగా జాజికాయ మొక్కలు పెంచేలా ఉద్యాన వర్సిటీ రైతులను కార్యోన్ముఖుల్ని చేస్తుంది. ఈ మొక్కల పెంపకంలో మెళకువలు నేర్చుకొనేందుకు ఉద్యాన వర్సిటీ పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రం రైతులు కేరళ వెళ్లి వచ్చారు.ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎం.మురళీకృష్ణ వంటి అభ్యుదయ రైతులు ఈ సాగులో సత్ఫలితాలు సాధించారు. జాజికాయ సాగు లాభాలు రైతుల్ని ఆకర్షిస్తున్నాయి.

లాభాల పంటే,..

మిరిస్టికా ఫ్రాగ్రెన్స్ అనే శాస్త్రీయ నామంతో పిలిచే జాజికాయ సుగంధద్రవ్య పంటగా ఖ్యాతి నొందింది. 25 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో పెరిగే ఈ మొక్కల సాగుపై సుదీర్ఘ పరిశోధన జరుగుతూనే ఉంది. కేరళలోని ఐసీఏఆర్, ఐఐఎస్ఆర్, కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం, సుగంధ ద్రవ్యాల బోర్డు జాజికాయ మీద విస్తృత పరిశోధనలు చేశాయి. విశ్వశ్రీ, కేరళశ్రీ, కొంకణ్ సుగంధ, కొంకణ్ స్వాద్, నోవా, కల్లింగల్ వంటి రకాలు సాగుకు అనుకూలంగా ఉన్నట్టు తేల్చారు. ఎపికోటైల్ గ్రాఫ్టింగ్ ద్వారా వాణిజ్యపరంగా జాజికాయ మొక్కలు పెంచుతున్నారు. ఉద్యాన అధికారులు సిఫార్సు చేసిన మొక్కలను పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా నాటుకోవచ్చు. వక్కతో కలిపి కూడా సాగు చేసుకోవచ్చు. ఎక్కువగా తెగుళ్ల ఆశించని ఈ మొక్కలు ఐదు నుంచి ఆరు సంవత్సరాలలో పంటను అందిస్తాయి. పువ్వులు పూసిన ఏడు నుంచి తొమ్మిది నెలల్లో పండ్లు కోసి, బాహ్య భాగాన్ని వేరుచేసి జాపత్రిని, జాజికాయను వేరుచేస్తారు. తర్వాత మార్కెటింగ్ చేసుకోవచ్చు.

దిగుబడి ఇలా

500 కాయల నుంచి కిలో జాపత్రి వస్తుంది. 100 కాయల నుంచి కిలో జాజికాయలు వస్తాయి. కాయ తొక్క నుంచి క్యాన్సర్‌ను నివారించే వైన్ తయారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పశువులు, కోతులు, మేకలతో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జాజికాయ పంటను ప్రోత్సహిస్తాం



జాజికాయ సాగును ప్రోత్సహించడానికి ఉద్యాన వర్సిటీ కృషి చేస్తుంది. అంతర పంటగా బహువార్షిక మొక్క జాజికాయ. ఈ సాగును రాష్ట్రంలో విస్తరించే క్రమంలో రైతులకు నైపుణ్య శిక్షణ ఇప్పించాం. కలవపల్లి గ్రామంలో పది సంవత్సరాల వయస్సు కలిగిన జాజికాయ మొక్కలు ఆశాజనకమైన దిగుబడులు అందిస్తున్నాయి. రైతులు వీటి పెంపకంపై ఆసక్తి కనపరుస్తున్నారు. జాజికాయ మొక్కల ప్రవర్ధనంపై ప్రత్యేక శిక్షణను రైతులకు ఇప్పించాం. ఈ ప్రాంతంలోనే జాజికాయ మొక్కలను అందుబాటులో తేవడానికి వర్సిటీ కృషి చేస్తుంది.

– డాక్టర్ తోలేటి జానకీరామ్, ఉపకులపతి, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం

కేవీకే ప్రత్యేక దృష్టి

అంటుపద్ధతిలో జాజికాయ మొక్కలను తయారు చేసి, ఆశక్తి ఉన్న రైతులకు తక్కువ ధరకు అందించే విషయంపై ఉద్యానవర్సిటీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఆసక్తి కలిగిన రైతులతో కలిపి వర్సిటీ వీసీ టి.జానకీరామ్ పర్యవేక్షణలో విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ నేతృత్వంలో కేరళ కోజికోడ్‌లో గత నెలలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఒక గ్రాఫ్ట్ 250 రూపాయల నుంచి వెయ్యి రూపాయల ధర ఉంది. పెద్ద చెట్లు ఉన్న రైతులు తక్కువకే ఈ మొక్కలను పొందడానికి గ్రాఫ్ట్ లేదా అంటుకట్టుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడింది. ఈ తరహా శిక్షణా కార్యక్రమం తొలిసారిగా చేపట్టినట్టు విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ తెలిపారు. జిల్లాలో పామాయిల్, కొబ్బరి, వక్క పంటల్లో అంతరసాగుగా జాజికాయ మొక్కలను పెంచడానికి అనువైన వాతావరణం ఉంది.

ఉపయోగాలెన్నో...

జాజికాయలో ఉండే మిరిస్టిసిస్ మెదడు చురుగ్గా పనిచేసేందుకు సహకరిస్తుంది. మతిమరుపు లక్షణాలను తొలగిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించే శక్తి జాజికాయకు ఉంది. మూత్రపిండాల్లో ఉన్న రాళ్లను కరిగించడంలో, మానసిక లొత్తిడి తగ్గించడంలో ఇవి క్రియాశీలక భూమిక పోషిస్తాయి. వీర్యకణాల ఉత్పత్తిని వృద్ధి చేస్తుంది.

ఉమ్మడి పశ్చిమలో..,

ఉమ్మడి పశ్చిమలో కలవపల్లికి చెందిన ఎం.మురళీకృష్ణ అనే అభ్యుదయ రైతు చాలా సంవత్సరాలుగా జాజికాయ మొక్కలను పెంచుతున్నారు. 2016లో పెంపకానికి చుట్టారు. ఆయిల్ ఫాం తోటల్లో అంతరసాగుగా వీటి పెంపకాన్ని చేపట్టారు. కేవీకే ఆత్మల సహకారంతో మేలు ఫలితాలు పొందుతున్నారు.

24న అండర్-13 ఓపెన్ చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24న భీమవరంలో అండర్-13 జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ గురువారం చెప్పారు. అనసూయ చెస్ అకాడమీలో ఆదివారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి తరువాత జన్మించి ఉండాలన్నారు. విజేతలు విజయనగరంలో అక్టోబర్ 19 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి ఫైడ్ రేటెడ్ అండర్-13 ఓపెన్ చెస్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరాల కోసం 90632 24466 నెంబర్‌కు సంప్రదించాలని కిషోర్ తెలిపారు.

యర్రంశెట్టివారిపాలెంలో చోరీలు



చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ తదితరులు

నరసాపురం రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యర్రంశెట్టివారి పాలెంలో మూడు చోరీలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం ఒకే రోజున వేర్వేరు ఇళ్లలో ఈ దొంగతనాలు జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇవి జరిగాయని నిర్ధారించారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు యర్రంశెట్టివారి పాలెం గ్రామానికి చెందిన కూనపరెడ్డి కృష్ణ ఇంట్లో 8 కాసుల బంగారు ఆభరణాలతో పాటు లక్ష రూపాయల నగదు, మల్లిపూడి కుమారి బీరువాలోని బంగారు చెవిదిద్దులు, నగదుతోపాటు ఇంటి అరుగుపై నిద్రిస్తున్న కూనపరెడ్డి బేబీరామానుజమ్మ మెడలో ఐదుకాసుల సూత్రాల తాడు చోరీకి గురైన ఫిర్యాదు అందింది. చోరీ జరిగిన ఇళ్లను డీఎస్పీ రవిమనోహరచారి, సీఐ శ్రీనివాసయాదవ్, ఎస్సై ఏజీఎస్ మూర్తిలు పరిశీలించారు.

ఏరియా ఆసుపత్రిలో శిశువు మృతి



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న శిశువు కుటుంబసభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన మగ శిశువు మృతి చెందడంపై బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పురిటి నొప్పులతో ఆసుపత్రికి వస్తే ఆపరేషన్ చేసి మృతిచెందిన శిశువును అప్పగించారని బాధితులు వాపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రాజీవ్ నగర్‌కు చెందిన సజ్జ మురళీకృష్ణ కుమార్తె హేమలతకు రాజమండ్రికి చెందిన ఉల్లి వీరబాబుతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. గతంలో ఒక బిడ్డ పుట్టగా.. రెండో బిడ్డ పురిటి కోసం హేమలతను జంగారెడ్డిగూడెం తీసుకు వచ్చారు. శనివారం హేమలతను ఏరియా ఆసుపత్రికి తీసుకువస్తే ఇంజక్షన్ ఇచ్చి ఆదివారం ఇంటికి పంపారని హేమలత కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం హేమలతకు నొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకువచ్చామని తెలిపారు. ఆపరేషన్ చేసి పండంటి మగ బిడ్డకు అందిస్తారని ఆశతో ఎదురుచూస్తున్నామని, తమకు మృతి చెందిన మగ శిశువును చేతుల్లో పెట్టారని కన్నీటిపర్యంతమయ్యారు. ఆసుపత్రి వద్ద బైఠాయించి న్యాయం చేయాలని నిరసన తెలిపారు. ఈ సంఘటనపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల స్పందిస్తూ.. హేమలతను గత శనివారం ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షించినట్టు తెలిపారు. నెలలు పూర్తిగా నిండకపోవడంతో మందులు ఇచ్చి ఇంటికి పంపామన్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నొప్పులతో బాధపడుతున్న హేమలతను ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. హేమలత నొప్పులతో బాధపడటం చూసి వెంటనే ఆపరేషన్‌కు సిద్ధం చేశామని తెలిపారు. తల్లి ప్రాణానికి హాని కలగకుండా జాగ్రత్త తీసుకున్నామన్నారు. ఆపరేషన్ చేసే సమయానికి కడుపులో మగ బిడ్డ అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆస్పత్రికి తీసుకురాక ముందే బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. హేమలత ప్రాణానికి హాని కలగకుండా వెంటనే చికిత్స చేశామని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా లేదని వివరించారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



కలిదిండి మండలం భాస్కరరావుపేట ఉన్నత పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులు

కైకలూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీలలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కైకలూరు నియోజకవర్గం నుంచి పలువురు ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల్లో ఎంపికైన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులను హెచ్ఎంలు గురువారం సన్మానించారు. కలిదిండి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హర్షవర్ధిని(అండర్ – 14), కె.శృతి(అండర్ – 17), అండర్ – 14 విభాగంలో భాస్కరరావుపేట ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.సుధాధనలక్ష్మి, అండర్ – 17 విభాగంలో జె.ప్రసన్న రాణి, పి.మౌనిక, ఎస్.చరిష్మా, మండవల్లి మండలం చింతపాడు ఉన్నత పాఠశాల నుంచి అండర్ – 17 విభాగంలో ఎం.భానుచందర్, జె.మంజుభగవాన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున ఎంపికయ్యారు. ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు స్వర్ణకుమారి, కె.పాండురంగారావు, కెఎస్ఎస్ఎస్.ఆంజనేయులు, పీడీలు ఏ.మావుళ్ళేశ్వరరావు, బి.కృష్ణకుమారి, కె.రత్నదాసు, డి.సుబ్బారావు, రవిబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏలూరు విద్యార్థిని ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు ఎన్ఆర్‌పేటలో ఉంటున్న ఒక విద్యార్థిని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంది. కూలి పనులు చేసుకునే కాళిదాసు జోజిబాబుకు ముగ్గురు కుమార్తెలు.. చిన్న కుమార్తె కాళిదాసు హెప్సిబా (15) పదో తరగతి చదువుతుంది. కుటుంబ సభ్యులు గురువారం ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి ఏలూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రైలు కింద పడి ఇద్దరు మృతి



గూడెం పట్టణంలోని ఓవర్‌బ్రిడ్జి కింద మృతి చెందిన వ్యక్తి



చేబ్రోలు స్టేషన్ సమీపంలో మృతి చెందిన వ్యక్తి

తాడేపల్లిగూడెం: స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోని చేబ్రోలు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌ల సమీపంలో ప్రమాదవశాత్తు రైలుకింద పడి ఇద్దరు మృతిచెందిన సంఘటనలు గురువారం జరిగాయి. తెల్లవారు జామున చేబ్రోలు– తాడేపల్లిగూడెం స్టేషన్ మధ్య విజయవాడ వెళ్లే మార్గంలో 50 ఏళ్ల వ్యక్తి మరణించినట్టు గుర్తించారు. నీలం రంగు ప్యాంటు, తెలుపు రంగుపై అడ్డం నిలువు చారలతో ఫుల్‌హ్యాండ్ షర్టు ధరించి ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. గురువారం ఉదయం జరిగిన మరో ప్రమాదంలో గూడెం-నవాబుపాలెం మధ్య మరో వ్యక్తి రైలు కిందపడి మరణించాడు. అతని వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుంది. మెరూన్ కలర్ నైట్ ప్యాంట్, తెలుపు రంగు కట్ బనియన్, నలుపురంగు డిజైన్‌తో ఉన్న టీ షర్టు ధరించి ఉన్నాడు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు జి.హరిబాబు, రైల్వే ఎస్ఐ. 9490617090 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు కొండా బత్తుల రమేష్ (ఫైల్)

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెయింటర్ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్సై సురేష్‌కుమార్ వివరాల ప్రకారం దెందులూరు మండలం కొమిరేపల్లికి చెందిన కె.రమేష్(24) ఈ నెల 17న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి నల్లజర్ల వెళ్లాడు. కొమిరేపల్లి వస్తుండగా అంబర్‌పేట శివారు వేబ్రిడ్జి వద్ద రాత్రి 7 గంటల సమయంలో బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలవడంతో.. వెనుక వస్తున్న స్నేహితులు రమేష్‌ను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పశ్చిమలో భారీ వర్షం



నరసాపురం మెయిన్‌రోడ్డులో వర్షపు నీరు

సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లాలో మొగల్తూరు మండలంలో 68.4 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం నమోదైన వర్షపాతం వివరాల ప్రకారం.. నరసాపురంలో 43.8. కాళ్లలో 43.2, భీమవరంలో 40.2, ఉండిలో 39.2, ఆకివీడులో 37.6, వీరవాసరంలో 26.2, పాలకొల్లులో 18.4, తణుకులో 15.4, ఇరగవరంలో 15.2, ఆచంటలో 15.2, పెంటపాడులో 14.2, తాడేపల్లిగూడెంలో 14, పాలకోడేరులో 13.4, గణపవరంలో 12.4, యలమంచిలిలో 11.4, పెనుమంట్రలో 9.4, పెనుగొండలో 8.6, అత్తిలిలో 8.4, పోడూరులో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నరసాపురంలో..

నరసాపురం: పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 10 గంటల నుంచి రెండు గంటలపాటు ఎడతెరిపిలేని వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్టీమర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు, చేపలమార్కెట్ ప్రాంతాల్లో రోడ్లు నీటమునిగాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లపై నీరు నిల్వ ఉండిపోయింది. బస్టాండ్‌లో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు బేరాలులేక అవస్థలు ఎదుర్కొన్నారు.

తానా సాహితీ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రమావతి



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక, నారీ సాహిత్య భేరి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న అంతర్జాల అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ అంతర్జాల సాహితీ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ తాడేపల్లిగూడెం నుంచి శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి విశిష్ట అతిథిగా పాల్గొంటున్నారు. ఈ సాహిత్య సమావేశంలో 15 దేశాల నుంచి తెలుగు కవయిత్రులు పాల్గొననున్నారు. విశిష్ట అతిథిగా ఆహ్వానించిన తానా అంతర్జాతీయ సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ డైరెక్టర్ మురళి, హాజరైన పంచాయతీ కార్యదర్శులు

ఏలూరు(మెట్రో): గ్రామాల్లో కొత్తగా లేఅవుట్ల ఏర్పాటుకు అమల్లో ఉన్న నిబంధనలతోపాటు పరిపాలనకు సంబంధించి 6 అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ జీఎస్‌డబ్ల్యూఎస్(ఏపీఎస్ఐఆర్ డీపీఆర్) డైరెక్టర్ జె.మురళి పాల్గొన్నారు. గురువారం స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రేడ్- 1 నుంచి గ్రేడ్-5 వరకు గల పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జె.మురళి మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త లేఅవుట్లకు సంబంధించి నిబంధనల అమలుపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. కొత్త లేఅవుట్ ఏర్పాటు, పరిపాలనా విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధిహామీ పనులు, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కెవీఎస్ఆర్ రవికుమార్, ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ జాయింట్ డైరెక్టర్ వై.దోసిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన ఆవిష్కరణలపై ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణను ఇస్తున్న కో ఆర్డినేటర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2023 డివిజన్ స్థాయి సైన్సు టీచర్లు శిక్షణా కార్యక్రమం గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి (ఏపీకాస్ట్) జిల్లా సమన్వయాధికారి మల్లుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఒక రోజు శిక్షణలో సైన్స్ ఉపాధ్యాయులకు వివిధ ప్రాజెక్టుల రూపకల్పనపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకున్న ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో విద్యార్థులతో నూతన ఆవిష్కరణలు చేసే దిశగా ప్రాజెక్టులు తయారు చేయించాలని సూచించారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ రాజు, రిసోర్స్‌పర్సన్ ఎం.వి.భాస్కరరావు, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, టి.సతీష్ కుమార్, జి.సుకుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న చింతపల్లి, రావిపాడు గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: ఈ నెల 23న సాయంత్రం చింతపల్లి, రావిపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాపతినిధులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏరియా కమిటీ నాయకులు ఓసూరి వీర్రాజు కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గురువారం భోజన విరామ సమయంలో మునిసిపల్ కార్మికులు, పురపాలక సంఘ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కార్మికులు కె.చంద్రరావు, కె.కాటమరాజు, యు.నాగరాజు, ఎం.రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, శారమ్మ, కనకలక్ష్మి, జయసుధ, శంకర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సు సర్వీసులకు సంబంధించి సమస్యలు, సలహాల కోసం శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. కావున తణుకు డిపో పరిసర ప్రాంత ప్రయాణికులైన విద్యార్థులు, వ్యాపారులు, ఆర్టీసీ ప్రయాణికులంతా తమ విలువైన సలహాలు, సూచనలను తెలియపరిచేందుకు 99592 25484 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



బల్లిపాడులో సర్వసిద్ధి వినాయకస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం బల్లిపాడు కొత్త చెరువుగట్టుపై ఉన్న సర్వసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నెలకొల్పిన గణపతి ప్రతిమను గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన వాహనంపై మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమను ఉంచి, కేరళడప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి, ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం స్వామివారి ప్రతిమను కొలనులో నిమజ్జనం చేశారు.

23న ప్రజా వేదిక

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి ఈనెల 23న ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎండీ అమీలుజమా తెలిపారు. 2022 ఏప్రియల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు అత్తిలి మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై ఈనెల 10 నుంచి 22 వరకు నిర్వహించే సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలను ప్రజా వేదికలో తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆడుతూ.. పాడుతూ

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్లబోధన
- రేపటి తరానికి మంచి పునాది



అలంపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆటపాటలతో ఆడిస్తున్న దృశ్యం

పెంటపాడు: బాల్యం ఎంతో అమూల్యమైనది. అందునా చిన్నారుల జీవితాలలో మొదటి ఆరేళ్లు ఎంతో విలువైనవి. మూడేళ్లవరకు తల్లిఒడికి పరిమితమయ్యే పిల్లలు అనంతరం బయట ప్రపంచాన్ని అలవాటు చేసుకొనే ప్రయత్నాలు మొదలు పెడతారు. ఈ వయస్సులో చూపిన, విన్న అంశాల ఆధారంగా చిన్నారులు తన బుద్ధిని, తెలివితేటలను వికసింపజేసుకొంటారు. అందుకే అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో పాటు, చిన్నారులకు ఇష్టమైన ఆట, పాట, కథల ద్వారా వారి మనస్సులు హత్తుకునేలా బోధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఈ విధమైన విద్యా ప్రభావం పిల్లల్లో ప్రాథమిక స్థాయిలో కాకుండా ఉన్నత స్థాయిలో విద్యాప్రమాణాలు అందించేందుకు దోహదపడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఇష్టమైన విధంగా బోధన చేసేందుకు జనభాగీధారి కార్యక్రమానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలలో వర్కుబుక్స్, స్పోకెన్ ఇంగ్లీషు పుస్తకాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్యను ఎలా అందించాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

పెంటపాడు మండలంలో 78 కేంద్రాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాలలో చిన్నారులను ఆకర్షించేందుకు జగభాగీదారి కార్యక్రమం ప్రవేశపెట్టి ఆటపాటలతో విద్యాబోధన సాగిస్తున్నారు. ప్రతీ పాఠాన్ని ఏదో ఒక ఆట, పాట, కథలతో మిళితం చేసి నేర్పిస్తుండటంతో చిన్నారులలో ఆసక్తి నెలకొంది. తొలుత చిన్నారుల తల్లుల ద్వారా నేర్పి తరువాత అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల ద్వారా ఈ కార్యక్రమం చేయడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు హాజరుమిస్ కాకుండా వస్తున్నట్లు తెలిసింది. చిన్నారుల మనో వికాశం, వ్యక్తిత్వం పెంపొందించేందుకు పలు ఆటలు ఆడిస్తున్నారు. ఈ విధానం ఎంతో బాగుందన్న ప్రశంసలు పలు ప్రాంతాలలో వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవలు విద్యాబోధనపై ప్రతీ ఒక్కరూ అవగాహన చేసుకొని చిన్నారులను కేంద్రాలకు పంపించే విధంగా సహకారం అందించాలని కోరుతున్నారు.



పెంటపాడులో చిన్నారుల ఆటపాటలు

జనభాగీధారి మంచి ఫలితాలనిస్తోంది



ఆరేళ్లలోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేసేలా చేపట్టిన జనభాగీధారి కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలంటే ఎంతో నచ్చుతాయి. అలా ఆటపాటల ద్వారానే విద్యను మిళితం చేసి నేర్పిస్తున్నాం. ఈ కార్యక్రమం పట్ల అందరిలోనూ మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రశంసలు కూడా వస్తున్నాయి.

– దుర్గా భవాని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పెంటపాడు-1

తల్లిదండ్రుల్లో చైతన్యం



తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొచ్చేలా, చిన్నారుల మనస్సును హత్తుకొనేలా అంగన్‌వాడీ ఆటపాటల ద్వారా విద్యను నేర్పిస్తున్నాం. జనభాగీధరిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులను కేంద్రాలకు పంపించాల్సిన ఆవశ్యకతను వివరించి చైతన్యం తీసుకొస్తున్నాం.

– పి. విజయ, ప్రత్తిపాడు అంగన్‌వాడీ వర్కర్

పోలింగ్ కేంద్రాలను పకడ్బందీగా తీర్చిదిద్దాలి



అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ

అత్తిలి: ప్రతీ గ్రామంలో రెండు కిలోమీటర్ల లోపు పోలింగ్ స్టేషన్ కచ్చితంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామసుందరరెడ్డి అన్నారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామ సచివాలయాన్ని గురువారం జేసీ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా చూడాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. 1500 మంది ఓటర్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రం కోసం ప్రతిపాదనలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల చేర్పులు, మార్పులపై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జేసీ

తణుకు టౌన్: ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇబ్బందుల్లేని విధంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ .రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తణుకు నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జెడ్ వెంకటేశ్వరరావుతో కలసి తణుకు నియోజకవర్గంలోని మండపాక గ్రామ శివారు ఎర్రనీలిగుంట, ఇరగవరం మండలం రేలంగి శివారు గమళ్లపాలెం గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్లు పీఎస్‌డీ ప్రసాద్, రామాంజనేయలు, మాలతీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో పోలింగ్ కేంద్రాలను జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి దుర్గేష్, తహసీల్దార్ శేషగిరిరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ ఆందోళన



తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెంటపాడు: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెంటపాడు మండల కార్యాలయం వద్ద రెండోరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు దూలపల్లి శ్రీనివాసరావు, మండల ఇన్‌చార్జ్ కంకట రవికుమార్‌లు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణకు అనేక పోరాటాలు చేస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ జీవీ శేషగిరిరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెదముర్తి చిన్ని, దేవతల శివాజీ, సీనియర్ నాయకులు బొలిపో రత్నాజీ, మహిళానాయకులు పాల్గొన్నారు.

దువ్వలో రాస్తారోకో

తణుకు టౌన్: పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తణుకు మండలం దువ్వ గ్రామంలో ఏమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు రహదారి దిగ్బందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి విస్సంపల్లి సిద్దు, కన్వీనర్ లంక రాజశేఖర్, కోకన్వీనర్ గాలింకి ప్రేమ్‌కుమార్, దూలపల్లి బ్రహ్మాజీ, రాంబాబు, బెన్నీ, పెదముత్తి ఆనంద్, అబ్బదాసరి ఏసు, కాపు నాయకురాలు కేసరపు జ్యోతి, బీసీ నాయకురాలు రామలక్ష్మీ, కండెల్లి రవి, చౌటుపల్లి నవీన్, దూలపల్లి శివ పాల్గొన్నారు.

తణుకులో గురజాడ జయంతి వేడుకలు



తణుకులో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన శ్రీశ్రీ సేవా విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అమర వీరుల భవనంలో డి.దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కులమతాలు విడనాడి ఏ ప్రాంతంలో అయినా కలిసిమెలిసి ఉండాలని గురజాడ సూచించిన మార్గంలో నడుచుకోవాలని కోరారు. అంతకుముందు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీశ్రీ సేవా కేంద్రం పేరుతో ప్రతి ఏటా ఇకపై సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పీఎల్ నర్సింహారావు, అజయకుమారి, గోపి పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త.. గురజాడ

తణుకు టౌన్: దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అంటూ ఎలుగెత్తి చాటిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు తణుకు సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు కొనియాడారు. పట్టణంలో గురుజాడ అప్పారావు జయంత్యుత్సవాన్ని గురువారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ దేశంలో మూఢనమ్మకాలు, దురాచారాల నుంచి ప్రజల్ని బయటకు తీసుకువచ్చేందుకు తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అన్నారు. కన్యాశుల్కం నాటకం ద్వారా సమాజంలోని రుగ్మతల్ని గురజాడ కడిగివేశారని అన్నారు. మూఢనమ్మకాలపై ఎక్కుపెట్టిన అస్త్రం అప్పారావు తెలిపారు. విద్యార్థులకు దేశభక్తి గేయాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయుడు బండి సాయి రామ్‌ను ఘనంగా సత్కరించారు. స్కూల్ డైరెక్టర్ పాతూరి సీతారామయ్య చౌదరి, ఎస్ఎస్ సాయి దేవి, మార్లపూడి అనిత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో మేలైన దిగుబడులు



తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో డ్రోన్ల సహాయంతో స్ప్రే చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎటువంటి పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల మేలైన దిగుబడులు వస్తాయని వెంకట్రామన్నగూడెం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఇ.కరుణశ్రీ అన్నారు. ఉద్యాన పంటలపై డ్రోన్ల సమగ్ర వినియోగంపై గురువారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో అవగాహన కార్యక్రమం, ప్రకృతి విధానంలో పండిస్తున్న పొలానికి బయోకల్చర్ స్ప్రే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త కరుణశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల సాగులో ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి రైతు తమ పొలంలో కొంత భాగంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, తాడేపల్లిగూడెం జోనల్ కోఆర్డినేటర్ రత్నాజీ, రాఘవేంద్రరెడ్డి, వీఏఏ లోకేశ్వరి, ఐసీఆర్‌పీలు బి.నాగరత్నం, డి.అరుణ, దుర్గాభవాని, రైతు మరిడి నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయండి



తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దళితుల సమస్యలపై చేపట్టిన దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కేవీపీఎస్ నాయకుడు పిట్ల కృపారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దళిత రక్షణ యాత్ర భీమవరంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదిన తాడేపల్లిగూడెం మండలానికి విచ్చేస్తుందన్నారు. ఈ నెల 29వ తేదిన విజయవాడలో జరిగే మహాధర్నాకు దళిత సంఘాలు, అంబేడ్కర్ యువజన, కార్మిక, మహిళా సంఘాలు,మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవపల్లి దొరబాబు, దాసరి చిన్న, అలమండ సాయి, అలమండ ఆంజనేయులు, పెట్ల రామరాజు, లంక భాను, ఎల్.శీనమ్మ, నాగమణి, మారంపూడి అనిత, కుమారి, లంక రమణ, అలమండ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు దండగర్ర విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన తాడేపల్లిగూడెం దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. యోగా అండర్-17 విభాగంలో చెరకు వడ్డికాసులు ప్రథమ, మరపట్ల లక్ష్మీప్రసన్న ద్వితీయ, బాలికలు విభాగంలో మరపట్ల సుస్మిత ప్రథమ, దండే మమత ద్వితీయ, అండర్-14 బాలుర విభాగంలో ఆకుల వెంకన్నబాబు ప్రథమ, పి.రాజేష్ ద్వితీయ, కే.హేమంత్ నాల్గవ స్థానం, ఆర్.చైతన్య ఐదవ స్థానం, బాలికల విభాగంలో కే.హామిని నాల్గవ స్థానం, ఎం.కోట లక్ష్మి ఐదవ స్థానం, కబడ్డీ అండర్-17 బాలుర విభాగంలో రాపాక కౌశిక్, కబడ్డీ అండర్-14 విభాగంలో ఊబా వెంకటేష్, మరపట్ల ప్రేమ్‌కుమార్, కబడ్డీ అండర్-17 విభాగంలో వి.జ్యోతివైష్ణవి, అండర్-14 విభాగంలో ఎ.చిన్నారి, యు.ప్రవల్య జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ గురువారం వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలంలోని జగన్నాథపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో చక్కని ప్రతిభ చూపారు. పీడీ కట్టా వెంకటేశ్వరరావు శిక్షణలో తీసుకున్న విజేతలను ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ జి.శ్రీను, కమిటీ సభ్యులు అభినందించారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు, నాయకులు



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం 107 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేసిన దృశ్యం

ఇరగవరం : తల్లీబిడ్డా క్షేమంగా ఉండాలంటే తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాల్సిందేనని సీడీపీఓ ప్రమోదిని కుమారి అన్నారు. గురువారం ఇరగవరంమండలంలో ఎంపీడీవో కార్యాలయంలో పోషణ మహా కార్యక్రమం అమలుపై ప్రత్యేక అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ, బాలింత తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని అన్నారు. వీరికి అంగన్‌వాడీలు సరైన అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, అలాగే 7వ నెల నుంచి 24 నెలల వరకు పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వెయ్యిరోజుల పోషక మహా కార్యక్రమ ఉద్దేశాలను తప్పకుండా తెలుసుకుని, ప్రతి ఒక్కరికీ తెలియచేయాలని అన్నారు. చాలా మంది గర్భిణులు, బాలింతలు పోష్టికాహారంపై నిర్లక్ష్యం వహిస్తున్న దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశిస్తున్న వాటిని ఎప్పటికప్పుడు వారికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యాంబ, కాంత కుమారి, నాగలక్ష్మీ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, బాలింతలుల తదితరులు పాల్గొన్నారు.

పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం

తాడేపల్లిగూడెం రూరల్: పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని తాడేపల్లిగూడెం సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న అన్నారు. పోషకాహార మాసోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలోని నెం.107 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలపాల రామన్న మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త డి.వరలక్ష్మి, ఏఎన్ఎం ఎస్. గంగాదేవి, ఆశ కార్యకర్త పి.సత్యవతి పాల్గొన్నారు.

మాధవరంలో..

మాధవరం అంగన్‌వాడీ కేంద్రం నెం.144లో పోషకాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.హేమలత, కే.కనకమహాలక్ష్మి, ఎం.నాగమణి, ఆర్.చంద్రావతి, ఊడలమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కుంచనపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నెం.96, 97, 263లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.అచ్చమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.మంగ, ఎ.సుబ్బాయమ్మ, కే.కుమారి, ఏఎన్ఎం దానమ్మ, కార్యకర్తలు, సహాయకులు, తల్లులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఎదగాలి



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఎదగాలని కో-ఆర్డినేటర్ డి.శేఖర్‌బాబు తెలిపారు. పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ స్థాయి అండర్ 14, అండర్ 17 బాల బాలికల సెలక్షన్స్ గురువారం జరిగా యి. విజేతలు జిల్లా స్థాయికి ఎంపికైయారు. 9 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓలు జ్యోతి, టీవీ రామకృష్ణలు ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయి కో-ఆర్డినేటర్ డి.శేఖర్‌బాబు, మండల కోఆర్డినేటర్ ఎ.ఈశ్వర్, జిల్లా గౌరవాధ్యక్షులు సీహెచ్.సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామలాంబ, కె.వెంకటేశ్వరరావు, సుభద్ర, పర్యవేక్షించారు. అండర్ 17 బాలురు విభాగంలో 100 మీటర్లు తాడేపల్లిగూడెం ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు వి.జయరామ్, టి.సిద్దు, 100 మీటర్స్ లాగ్ జంపింగ్‌లో టి.అఖిల్ ఆరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూ స్కూల్, వి.జయరామ్ తాడేపల్లిగూడెం ఎంజీఎం స్కూల్, షాట్‌పుట్‌లో కె.జగన్ ఆరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూ స్కూల్, ఎఫ్.నాగ సంతోష్ అలంపురం జెడ్పీ స్కూల్, డిస్కెస్ త్రోలో కె.జగన్ అరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూ స్కూల్, బి.ప్రభు తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైయారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ):పట్టణంలోని టూ టౌన్ పరిధిలో 11 కేవీ జువ్వలపాలెం నుంచి వచ్చే టౌన్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ లైన్‌లను షిఫ్ట్ చేసే నిమిత్తం ఈ నెల 22వ తేదీ శుక్రవారం రోజున విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు, సవితృపేట, నవ్వారుపేట, మార్కెట్ ఏరియా, భీమవరం బైపాస్‌రోడ్డులోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెంటపాడు: ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళలు పేర్కొన్నారు. గురువారం పెంటపాడు గ్రామంలో పోషణమహా మాసోత్సవాలు పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వర్మీ కంపోస్టు కిట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో తయారు చేసిన వర్మీ కంపోస్టు కిట్లను డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ తెలిపారు. సర్పంచ్ ఆరుగొలను శ్రీను, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.